


# కృతజ్ఞత

ఎన్. శివనాగేశ్వరరావు

'విశ్వం! నేను నా జీవితంలో ఇంతవరకు ఎవరినీ చేయి చాచి అడిగింది లేదు. అలాంటిది కన్నకూతురు భవితవ్యం బాగుండాలని నీ చేతులు పట్టుకుని ప్రాధేయపడుతున్నాను. కాదనక స్వప్నతో పెళ్ళికి సమ్మతించు' తన చేతులు పట్టుకుని దీనంగా అడుగుతున్న గంగాధరంగారి వంక విశ్వం ఇబ్బందిగా చూశాడు.

అతని భావం గ్రహించిన గంగాధరంగారు ''నిజమే! స్వప్నకు ఆడపిల్లలకు ఉండవలసిన అణకువ, వినయం లేవు. పొగరు కూడా ఎక్కువే! బట్... విశ్వం! ఆడపిల్ల తండ్రిగా నేను కోరుకునేది దాని సుఖం. స్వప్నను పెళ్ళి చేసుకుంటే నీవేం కోల్పోతావో నాకు తెలుసు. తెలిసీ, నా కూతురు సుఖపడాలన్న స్వార్థంతోనే నిన్ను అల్లుడ్ని చేసుకోవాలని కలలు కంటున్నాను. ప్లీజ్ కాదనకు!'' విశ్వం ఎక్కడ తన ప్రపోజల్ కాదంటాడోనన్న భయం గంగాధరం కళ్ళల్లో స్పష్టంగా తొంగిచూసింది.

అది విశ్వం దృష్టిని దాటిపోలేదు. విశ్వానికి గంగాధరంగారి గురించి బాగా తెలుసు. ఒకప్పుడు బిజినెస్‌లో లక్షల్లో నష్టం వచ్చి ఆస్తంతా తుడిచిపెట్టుకుపోయినా, గంగాధరంగారు భయపడలేదు. ఎవరినీ చేయి చాచి సాయం అడగలేదు. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో మరలా చిన్నస్థాయిలో వ్యాపారం ప్రారంభించి త్వరలోనే లక్షలు గడించారు.

ఆయనకు జీవితం గురించి బాగా తెలుసు. అందుకే ఎందరికో ఆసరాగా నిలబడి జీవితాలు నిలబెట్టారు. అతని సహాయం పొందిన వారిలో విశ్వం ఒకడు.

ఒకరోజు, గంగాధరంగారి ఫ్రెండ్ ఒకతను, తన కంపెనీలోని సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ కోసం ఇంటర్వ్యూ కండక్ట్ చేశాడు. ఇంటర్వ్యూ బోర్డు మెంబర్స్‌లో గంగాధరం కూడా ఉన్నారు. ఇంటర్వ్యూలో విశ్వం తెలివితేటలకు ఆయన ముగ్ధులయ్యారు. అయితే అప్పటికే ఆ ఉద్యోగం మరొకరికి ప్రామిస్ చేశారు.

అందుకు బాధపడిన గంగాధరంగారు విశ్వాన్ని పిలిపించి, అతని కుటుంబ పరిస్థితి తెలుసుకుని కొంత ఆర్థిక సహాయం చేయబోయారు. అయితే అంత కష్టంలోనూ విశ్వం అతని సహాయాన్ని సున్నితంగా తిరస్కరించాడు. ఆ ఆత్మాభిమానం వల్లనే గంగాధరంగారు విశ్వంపట్ల అభిమానం పెంచుకున్నారు.

అవకాశం చూసుకొని విశ్వానికి తన గ్రూప్ కంపెనీస్‌లో ఒక దాంట్లో ఉద్యోగం ఏర్పాటు చేశారు. ఆ తరువాత, తన తెలివితేటలతో ఆ కంపెనీల్లో పై ర్యాంక్‌కి చేరడానికి విశ్వంకి ఎక్కువ సమయం పట్టలేదు.

ఒకప్పుడు పూట గడవడానికి ఎన్నో అవస్థలు పడిన విశ్వానికి ఇప్పుడు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. తల్లి ఆరోగ్యం కుదుటపడింది. చెల్లి పెళ్ళి చేయగలిగాడు. అందుకు కారణమైన గంగాధరంగారి పట్ల అతని మనసు ఎన్నడూ కృతజ్ఞతతో నిండి ఉంటుంది.

గంగాధరంగారికి తనంటే అభిమానమని విశ్వానికి తెలుసు. అయితే ఇంతటి అభిమానం ఉందని ఎన్నడూ ఊహించలేదు. గంగాధరంగారి వంటి ఆస్తిపరుడికి అల్లుడు కావడానికి ఎవ్వరైనా సంతోషంతో అంగీకరిస్తారు.

అయితే వాళ్ళు డబ్బు కోసమే స్వప్న మెడలో తాళి కడతారని గంగాధరంగారికి బాగా తెలుసు. అదీగాక తల్లిలేని బిడ్డని గారాబంగా పెంచడంతో స్వప్న చాలా పెంకిగా తయారయింది. ఎంతటివారినైనా నిర్లక్ష్యంగా చూస్తుంది. ఒక్కోసారి స్వప్న ప్రవర్తన గంగాధరంగారే భరించలేరు. అలాంటి కూతురు భర్తతో ఎలా ప్రవర్తిస్తుందో... ఎంత తొందరగా భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చి, సంసారం విచ్ఛిన్నం అవుతుందో... గంగాధరంగారు సరిగానే ఊహించారు.

ఇన్ని ఆలోచించబట్టే అతను అల్లుడిగా విశ్వాన్ని ఎంపిక చేసాడు. విశ్వానికి ఆస్తిలేదు గాని తెలివితేటలున్నాయి. మంచి మనసుంది. డబ్బుమీద ఆసక్తి లేదు. అంతకంటె క్వాలిఫికేషన్ ఏం కావాలి? అని ఆలోచించిన గంగాధరంగారు విశ్వాన్ని వదలదలచుకోలేదు.

అయితే విశ్వానికి పెళ్ళి పట్ల కొన్ని నిశ్చిత అభిప్రాయాలున్నాయి. అతని దృష్టిలో డబ్బుకు విలువ లేదు. మంచి మనసున్న అమ్మాయిని పెళ్ళాడాలన్నది అతని కోరిక. అలసిపోయి ఆఫీసు నుంచి వచ్చిన భర్తను చిరునవ్వుతో రిసీవ్ చేసుకొని కప్పు కాఫీతో అలసట పోగొట్టే అమ్మాయి... అన్నం తినేవేళ... కొసరికొసరి వడ్డించే అమ్మాయి... కాసింత తలనొప్పి భర్తకు వస్తే... బాధతో తల్లడిల్లిపోయే అమ్మాయి... అలాంటి అమ్మాయిని భార్యగా చేసుకోవాలన్నది విశ్వం కోరిక.

అలాంటిది స్వప్నను పెళ్ళి చేసుకోమని గంగాధరంగారు అడగ్గానే విశ్వం ఆ విషయాన్ని జీర్ణించుకోలేకపోయాడు. స్వప్న గురించి ఆమె అభిజాత్యం గురించి అతను విని ఉన్నాడు. కారు డ్రైవర్లను, ఇంట్లోని నౌకర్లను పశువుల కంటె హీనంగా చూసే ఆమె ప్రవర్తన కళ్ళారా చూశాడు కూడా!

పెళ్ళి అయిన తర్వాత తనపై స్వప్న ఎంత దర్పం ఒలికిస్తుందో, ఎంత పెత్తనం చెలాయిస్తుందో విశ్వం ఊహించాడు.

అయితే జీవితంలో తనకు గంగాధరంగారు చేసిన సహాయం కూడా తక్కువదేమీ కాదు. అదే మాట తల్లితో అన్నాడు. అందుకామె ''ఒరే విశ్వం! మనమీ రోజు ఇలా ఉన్నామంటే కారణం ఆయన కాదూ? అందుకు మనం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేము. ఆ అమ్మాయి ఎలాంటిదైనా గాని ఆయన కోసం కాదనకు. మంచివారికి మంచే జరుగుతుంది. ఆ అమ్మాయిలో మార్పు రావాలని కోరుకుందాం!'' అంది. విశ్వం కూడా మనసులో అలానే ఆలోచించాడు.

విశ్వం, గంగాధరంగార్ని కలిసి ''మీ అమ్మాయికి పొగరని మీరే అన్నారు. నా ఆత్మాభిమానం సంగతి కూడా మీకు తెలుసు. ఈ రెండింటికి పొత్తు కుదురుతుందన్న నమ్మకం మీకుందా?'' అని ప్రశ్నించాడు. అందుకాయన ''మీ సఖ్యత గురించి నాకూ నమ్మకం లేదు. అయితే విడిపోరన్న నమ్మకం ఉంది. అంతకు మించి నీ రక్షణలో అమ్మాయి ఉంటే నాకు తృప్తి!'' అన్నాడు. విశ్వం తన సమ్మతిని తెలియపరిచాడు. ఆ మాత్రం దానికి ఆయన పసిపిల్లాడిలా సంబరపడిపోయారు. స్వప్నతో, విశ్వం పెళ్ళి ఘనంగా జరిగిపోయింది.

గంగాధరంగారు, విశ్వాన్ని అల్లుడిగా చేసుకున్నందుకు బిజినెస్ మాగ్నెట్స్ ఆశ్చర్యపోయారు. ఆయన గురించి బాగా తెలిసిన వారు మాత్రం అతని అంచనాలో దోషం ఉండదని భావించారు. స్వప్న కూడా తండ్రి మీద నమ్మకంతో, డబ్బు తక్కువవాడైతే విశ్వాసపాత్రుడైన నౌకరులా పడి ఉంటాడని పెళ్ళికి ఒప్పుకుంది.

అక్కడే ఆమె విశ్వాన్ని తక్కువగా అంచనా వేసింది. మొదటి రాత్రి మీగడ తరగలాంటి తెల్లచీర కట్టుకొని, మంచం మీద దర్జాగా పడుకొని, భర్తను చూసి కూడా కాళ్ళు ఊపుతున్న స్వప్నను చూసిన విశ్వం కోపగించుకోలేదు. చిరాకు పడలేదు. సున్నితంగా మందలించలేదు. ఆమె వంక ఒక్కచూపు చూసి మరో గదిలోకి పోయి పడుకున్నాడు.

అది స్వప్న ఊహించనిది. తన పక్కనచేరి బిడియంగా, అపురూపంగా అందని చందమామ అందినట్లు దగ్గరకు తీసుకుంటాడని భావించిన ఆమె అంచనాలు తారుమారయ్యాయి. అంతకుమించి విశ్వం చూపులోని నిర్లక్ష్యం ఆమెను తీవ్రంగా దెబ్బతీసింది. తిండికి గతిలేనివాడికి తన తండ్రి ఒక స్థాయి కల్పిస్తే తననే నిర్లక్ష్యంగా చేసేంతటి పొగరు వచ్చిందని భావించింది.

ఆ రోజు నుంచి మొదలయింది వాళ్ళిద్దరి మధ్య కోల్డ్‌వార్! విశ్వానికి వినిపించేలా స్వప్న అతన్ని చులకన చేసి మాట్లాడేది. నౌకరుకి పురమాయించినట్లు పనులు చెప్పేది.

అతను ఆఫీస్ నుంచి వచ్చే సమయానికి, అతని ఉనికిని గమనించనట్లు పడుకుని నవల చదువుకునేది. లేదా టి.వి. చూసేది. అయితే విశ్వం అదేమీ పట్టించుకునేవాడు కాదు. తన పనులు తనే స్వయంగా చూసుకునేవాడు. అంటే కాఫీ కలుపుకుని తాగడం, భోజనం వడ్డించుకొని తినడం వంటివి.

సర్వెంట్స్ చేయబోయినా అతను ఒప్పుకునేవాడు కాదు. అదేమని అడిగిన మామగారితో ''స్వప్న చేయవలసిన పనులు మరొకరు చేయడం నాకిష్టం లేదు. ఆమె చేసే ప్రసక్తి లేదు కాబట్టి నన్నే చేసుకోనివ్వండి'' అన్నాడు. గంగాధరంగారు మరింకేం మాట్లాడలేదు.

స్వప్న - అలా భర్తను సాధించలేకపోవడం గమనించి దారి మార్చింది. ఫ్రెండ్స్‌తో సినిమాలకు, క్లబ్బులకు తిరిగి ఇంటికి ఆలస్యంగా రాసాగింది. విశ్వం అదేం ఖాతరు చేయలేదు. తనెంత మూర్ఖంగా ప్రవర్తించినా కోపం తెచ్చుకోని విశ్వం మీద స్వప్నకు మరింత కసి పెరిగింది.

చివరిగా తిరుగులేని బాణం సంధించింది. విశ్వం తల్లి మీద కారాలు, మిరియాలు నూరింది. ఆ విషయంలో మాత్రం విశ్వం సర్దుకోలేకపోయాడు. అతన్నుంచి ప్రతిఘటన రాగానే స్వప్న మరింత విజృంభించింది.

అదంతా చూసిన విశ్వం తల్లి ''బాబూ! నేనెంతకాలం బ్రతుకుతాను. రేపోమాపో రాలిపోయే నావలన మీ మధ్య కలతలు రావడం నాకిష్టం లేదు. నేనెక్కడికైనా పోతాను'' అంది. ''నీకు నేను తప్ప ఎవరున్నారమ్మా?'' అని బాధపడ్డాడు విశ్వం. ''ఏదైనా వృద్ధ శరణాలయంలో చేర్పించు'' అందామె. విశ్వం ఒప్పుకోలేదు. ఆ తరువాత ఆమె అట్టేకాలం బ్రతకలేదు. ఒక రోజు రాత్రి నిద్రలోనే కన్నుమూసింది.

అంత బాధలోనూ విశ్వం తల్లి మనసు నొప్పించిన స్వప్నను నిందించలేదు. అది ఆమె మనసుకు బాధ కలిగించింది. తప్పు చేసానన్న ఫీలింగ్ కలిగింది. అయితే అది కొద్దిరోజులే!

ఆ తరువాత, ఆస్తి అల్లుడి పేర వ్రాయాలని ఆలోచన చేసిన తండ్రితో స్వప్న తగాదా పెట్టుకుంది.

అది తెలిసిన విశ్వం ''మామగారూ! ఆస్తి నా పేరున వ్రాసి నాకు లేనిపోని తలనొప్పి తెప్పించకండి. అదేదో స్వప్న పేరునే వ్రాయండి. తన సంతోషమేగా మనం కోరేది!'' అన్నాడు. గంగాధరంగారికి అలా చేయక తప్పలేదు.

కూతురు సంతోషంగా ఉండాలన్న స్వార్థంతో విశ్వం జీవితాన్ని కాలరాచానన్న మనోవేదన గంగాధరంగారి మనసులో చోటు చేసుకుంది. ఆవేదనతోనే ఆయన కాలం చేసారు.

తండ్రి మరణానికి దుఃఖిస్తున్న స్వప్నను విశ్వం ఓదార్చే ప్రయత్నం చేయబోయాడు. ''నీ ఓదార్పు నాకక్కరలేదు'' అని ఖరాఖండిగా చెప్పింది స్వప్న.

స్వప్నతో పెళ్ళయి అయిదేళ్ళయినా ఆమె ప్రవర్తనలో రవ్వంత మార్పు రాలేదు. మరింత మూర్ఖంగా ప్రవర్తించేది. అయినా విశ్వం ఆమెను ఏమనేవాడు కాదు. ఎవరి దగ్గరా భార్య గురించి చెడుగా మాట్లాడేవాడు కాదు.

అతని ప్రవర్తన స్వప్నకు వింతగా ఉండేది. ఆమె ఏనాడూ అతన్ని దరిచేరనివ్వలేదు. అభిమానంగా ప్రవర్తించలేదు. కనీసం ప్రేమగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయినా విశ్వంలో మార్పులేదు. అతని పెదవుల మీద చిరునవ్వు మాయం కాలేదు. అతని ముఖ కవళికలలో ఏనాడూ కోపం కానరాలేదు.

అదే ఆమెకు అంతులేని ఆశ్చర్యం కలిగించేది. ఇతను మనిషా? ఋషా? అని ఆలోచించేది స్వప్న.

అయితే విశ్వం ప్రతి ఆదివారం ఉదయం ఎక్కడికో వెళ్ళి రాత్రికి రావడం గమనించింది ఆమె. అది ఎప్పటినుంచో జరుగుతున్నది. మొదట్లో దానికంత ప్రాధాన్యం ఇవ్వలేదు గాని తండ్రి చనిపోయిన తరువాత ఆ విషయం బాగా గమనించింది.

దాని గురించి ఆలోచిస్తే ఆమె మనసుకు ఏదో లింకు దొరికింది. విశ్వానికి తప్పక వేరే స్త్రీతో సంబంధం ఉండి ఉంటుంది. అక్కడికే వెళ్ళి వస్తూ ఉండి ఉంటాడు. అందుకే తన పొందు కోసం తపించడం లేదు. తనను లక్ష్య పెట్టడం లేదు అని ఆలోచించింది స్వప్న. ఆ ఆలోచన ఆమెకు తప్పక నిజమై ఉంటుందనిపించింది.

మనసులో అనుమాన బీజమంటూ పడితే అది తప్పక వటవృక్షంగా మారి తీరుతుంది. భర్తకు తానివ్వని ప్రేమను పంచుతున్న ఆ స్త్రీమూర్తి ఎవరో తెలుసుకోవాలనిపించింది స్వప్నకు.

వెనువెంటనే ఆమె 'రామతీర్థ' అనే ప్రైవేట్ డిటెక్టివ్‌ని కలిసింది. బ్రీఫ్‌గా తన బ్యాక్‌గ్రౌండ్ చెప్పి తన భర్త ప్రతి ఆదివారం ఎక్కడికి వెళ్తున్నాడో తెలుసుకోవడంతోపాటు, తన నుంచి భర్త ఎటువంటి సుఖం పొందకపోయినా అతను సంతోషంగా ఉండడానికి కారణం తెలుసుకోమని కోరింది. అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెక్కురూపంలో అందించింది.

రెండు వారాల తరువాత ఆమెకు రామతీర్థ నుంచి రిపోర్ట్ అందింది.

''మేడమ్! మీరు ఆదేశించిన ప్రకారం మీ భర్తను రహస్యంగా అనుసరించి ప్రతి ఆదివారం ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవడం జరిగింది. సిటీకి దూరంగా సుమారు ఇరవై కిలోమీటర్ల దూరంలో కృష్ణచైతన్య అనాథ శరణాలయం ఉంది. మీవారు ఆదివారం ఉదయం అక్కడికి వెళ్తారు. అక్కడి అనాథ పిల్లలకు చాక్లెట్లు, బిస్కట్లు పంచుతారు. వాళ్ళను తీసుకుని దగ్గర్లో ఉన్న తోటకు వెళ్తారు. అక్కడ ఆ పసిపిల్లలతో ఆడతారు. పాడుతారు. వారికి కథలు చెప్తారు. వాళ్ళు చెప్పే కథలు వింటారు. వారిని ఊయల మీద ఊపుతారు. వాళ్ళతో భోంచేస్తారు. క్రికెట్ ఆడతారు. సాయంత్రానికి వాళ్ళను అనాథ శరణాలయంలో దింపి ఇల్లు చేరుతారు.

అంతేకాకుండా విశ్వంగారి గురించి విడిగా వాకబు చేశాం. అతనికి మీరనుమానించినట్లు స్త్రీ వ్యామోహం లేదు. కనీసం సిగరెట్ కూడా కాల్చని డిసిప్లిన్డ్ అతను. అతని గురించి ఎంక్వయిరీలో మీ గురించి కొన్ని నిజాలు తెలిసాయి. మీ వంటి అహంకారిని అతను కాబట్టి భరిస్తున్నాడని సర్వత్రా వినికిడి.

మిమ్మల్ని అతను సంతోషంగా ఎలా భరిస్తున్నాడు? అన్న ప్రశ్నకు సమాధానం ఏమంటే - సాగర మధనంలో హాలాహలం ఉద్భవించినప్పుడు పరమశివుడు దాన్ని స్వీకరించాడు. ఆ బాధను అతను ఎలా భరించాడంటే - అది హాలాహలమని తెలిసీ స్వీకరించబట్టే. మీ భర్త విషయంలోనూ అదే జరిగింది. అతను మీ అందం, ఆస్తి చూసి చేసుకోలేదు. మీ నాన్నగారిపట్ల ఉన్న కృతజ్ఞతాభావంతో మీ నైజం తెలిసీ వివాహమాడాడు. అందుకే మిమ్మల్ని భరించగలుగుతున్నాడు.

మీరు పెడుతున్న మెంటల్ టార్చర్‌ను పసిపిల్లలతో ఆడుతూ దూరం చేసుకుంటున్నాడు. మీరిచ్చిన చెక్‌ను ఈ ఉత్తరంతోపాటు జత పరుస్తున్నాను. ఎందుకంటే అది స్వీకరిస్తే మీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అది ఇష్టం లేదు... ఎందుకంటే...? - యువర్స్ సిన్సియర్లీ. రామ్‌తీర్థ'' అని ఉంది రిపోర్టులో.

ఆ రిపోర్ట్ చదివిన స్వప్న కనుల ముందు విశ్వం చిన్నపిల్లలతో ఆడుకుంటున్న దృశ్యం కనిపించింది. తను కలిగిస్తున్న మనోవేదనను అతనెలా పోగొట్టుకుంటున్నాడో అర్థమయింది! అతని పెదవుల మీద చెరగని చిరునవ్వుకు శక్తి ఎక్కడినుంచి వస్తున్నదో అర్థమయింది. విశ్వం ఔన్నత్యం అర్థమయింది.

ఆ రోజంతా సుదీర్ఘంగా ఆలోచించిన స్వప్న ఆ రాత్రి తన డైరీలో, ''నేను మారుతాను. మారి తీరుతాను. భగవాన్! విశ్వం వంటి మంచి వ్యక్తికి తగిన భార్యగా నన్ను నేను తీర్చిదిద్దుకోవడానికి తగిన మంచి బుద్ధిని నాకు ప్రసాదించు'' అని రాసుకుంది.